క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పాత రెవెన్యూ క్వార్టర్స్ (చింతచెట్లు)లో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆయుర్వేద వైద్యురాలు గ్రేస్ సెలస్టియల్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శ్వాసకోశ వ్యాధులు, కీళ్ల నొప్పులు, జీర్ణకోశ వ్యాధులు, స్త్రీ, చర్మ సంబంధిత రోగులు అధికంగా హాజరయ్యారు. వీరికి ఆయుర్వేద చికిత్స ప్రాముఖ్యత, యోగాసనాల ద్వారా ఆరోగ్య పదిలం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యోగా శిక్షకులు సోని, ఆస్పత్రి సిబ్బంది శ్రీనివాసులు, ప్రతాప్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ ప్రియాంక

బనగానపల్లె రూరల్: కేడీసీసీ బ్యాంకులో అమలు చేస్తున్న ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ ఖాతాను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు బనగానపల్లె శాఖ చీఫ్ మేనేజర్ ప్రియాంక అన్నారు. సోమవారం మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమంతో పాటు ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సహకార సమైక్య డిపాజిట్ కార్యక్రమంలో భాగంగా కేడీసీసీ బ్యాంకులో జీరో అకౌంట్, ఏటీఎం కార్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన పథకం కింద రూ.2లక్షల వరకు ప్రమాద బీమా అందిస్తున్నట్లు వెల్లడించారు. భానుముక్కల సహకార సంఘం సీఈఓ అబ్దుల్‌మునాఫ్, ఏఈఓ జీఎండీ షామీర్, ఎఫ్ఎల్‌సీ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకిపై విహరిస్తున్న శివపార్వతులు

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి పల్లకి సేవ సోమవారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య సోమవారం తెలిపారు. శిబిరంలో ప్రముఖ ప్రభుత్వ వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


భక్తిశ్రద్ధలతో ఉరుసు



విద్యుత్‌దీపాలంకరణలో దర్గా

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వల కొండపై ఉన్న శ్రీమౌలాలీ దర్గాలో సోమవారం ఉర్సు భక్తిశ్రద్ధలతో జరిగింది. ముస్లింలతో పాటు హిందువులు పెద్ద సంఖ్యలో మౌలాలీస్వామిని దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు.

రూరల్ సీఐగా బాధ్యతల స్వీకరణ



డీఎస్పీని కలిసిన రూరల్ సీఐ అస్రత్‌బాషా

డోన్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎస్.అస్రత్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా అనంతపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని కలిశారు.

డోన్‌కు పర్యాటక కళ

- వాల్మీకి గుహల ప్రారంభోత్సవంలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- రైతులకు పట్టాల పంపిణీ



వాల్మీకి గుహల వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: డోన్ నియోజకవర్గానికి పర్యాటక కళ తీసుకొచ్చామని.. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన గత పాలకులు పర్యాటక రంగాన్ని విస్మరించారని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్యాపిలి మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో రూ. 3 కోట్లతో అభివృద్ధి చేసిన వాల్మీకి గుహలను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్యాపిలి మండలంలో వాల్మీకి గుహలు రెండు దశాబ్దాల క్రితం వెలుగు చూశాయని తెలిపారు. అయితే గతంలో డోన్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు గుహల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. వాల్మీకి గుహలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. పర్యాటకులు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఐదేళ్లలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చిన ఘనత తమకే దక్కుతుందన్నారు. అనంతరం బోయవాండ్లపల్లి గ్రామానికి చెందిన 53 మంది రైతులకు 108 ఎకరాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు.

రూ. 8.32 కోట్లతో నిర్మించిన రోడ్లు ప్రారంభం

ప్యాపిలి మండలంలో రూ. 8.32 కోట్లతో వేసిన వివిధ రోడ్లను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. ఇందులో డోన్-రాయలచెర్వు రోడ్డు నుంచి పెద్దపాయ వరకు రూ. 4.4 కోట్లతో వేసిన రోడ్డు, రూ. 2 కోట్లతో వేసిన రాచవాండ్లపల్లి-గాజులపల్లి రోడ్డు, రూ. 1.92 కోట్లతో వేసిన నల్లమేకలపల్లి-రాచవాండ్లపల్లి రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా నారాయణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాంరెడ్డి, వెంకటరెడ్డి, పుల్లారెడ్డి, భైపురెడ్డి, జయరామిరెడ్డి, లక్ష్మిరంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఇందులో మల్లప్పగారి రామాంజి, ఈశ్వరయ్య, కోటయ్య నాగరాజు, తుగ్గలి భాస్కర్, తుగ్గలి అనిల్ కుమార్ తదితరులతో పాటు మొత్తం 20 కుటుంబాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన కార్యకర్తలు పార్టీ కోసం చురుగ్గా పని చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలచట్ల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బోరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు జయరామయ్య, రామ్మూర్తి, నాగరాజు, బాలంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ శాశ్వత హక్కులు కల్పిస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటి పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తామని తహసీల్దార్ నరేంద్రనాథ్, ఎంపీడీఓ వెంగన్న అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సత్యదీప్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 2987 మంది లబ్ధిదారులకు ఈ పథకంలో పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల వారీగా ఫిబ్రవరి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి శాశ్వత హక్కు పత్రాలను అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో విజేతలకు ఎంపీడీఓ శివరామయ్యతో కలిసి బహుమతులు అందజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. తాను కూడా కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నియోజకవర్గస్థాయి గ్రేస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.లక్ష రూ.50వేలు, రూ.20, రూ10 వేలను అందిస్తామని వెల్లడించారు.

ప్రతిభ కనబరిచిన జట్లు

నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్ల వివరాలను క్రీడాపోటీల ఇన్‌చార్జ్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. క్రికెట్ బాలుర విభాగంలో బనగానపల్లె సచివాలయం-4 జట్టు, బాలికల విభాగంగా కోవెలకుంట్ల సచివాలయం-4 జట్టు, కబడ్డీ బాలుర విభాగంలో బనగానపల్లె సచివాలయం-5 జట్టు, బాలికల విభాగంలో అవుకు మండలం గుండ్లశింగవరం సచివాలయం, ఖోఖో బాలుర విభాగంలో బనగానపల్లె మండలం టంగుటూరు సచివాలయం జట్టు, బాలికల విభాగంలో బనగానపల్లె సచివాలయం-1, వాలీబాల్ బాలుర విభాగంలో బనగానపల్లె సచివాలయం-2, బాలికల విభాగంలో అవుకు మండలం గుండ్ల శింగవరం సచివాలయం, బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో కొలిమిగుండ్ల సచివాలయం-5, బాలికల విభాగంలో బనగానపల్లె సచివాలయం-3 జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

ప్యాపిలి: బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్ (23), మల్లేష్ ద్విచక్రవాహనంపై యాగంటికి బయలుదేరారు. బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో కిరణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు కాలు విరగడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పవిత్ర, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

బేతంచెర్లలో మాల్దీవుల బృందం



మాల్దీవుల బృందంతో అధికారులు

బేతంచెర్ల: మాల్దీవుల నుంచి వచ్చిన బృందం బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని సోమవారం సందర్శించింది. డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి వారికి లీడర్‌షిప్ డెవలప్‌మెంట్, గ్రామీణ పరిపాలన వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారి రంగనాయక్, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ ఉన్నారు.

ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించండి



వినతులను పరిశీలిస్తున్న డీఆర్ఓ పుల్లయ్య

నంద్యాల: ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వినతులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో క్లియర్ చేయాలని ఆదేశించారు. స్పందనలో 187 మంది అర్జీదారులు వినతులు అందజేశారు.

సమస్యల్లో కొన్ని..

➲ గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన దూదేకు సిద్దయ్య తనకు ఎడమ కాలు, చేయి లేదని, వికలాంగత్వ సర్టిఫికెట్ కూడా ఉందని దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

➲ తనకు 2022 ఫిబ్రవరి నుంచి వృద్ధాప్య పింఛన్ ఆగిపోయిందని, తన కుమారుడు కారు కొన్నందున నిలిచిపోయిందని, బియ్యం కార్డులో తన కుమారుని పేరు తొలగించాలని కోరుతూ పాత కందుకూరు గ్రామానికి చెందిన సుందరరాజు దరఖాస్తు సమర్పించారు.

తీరిన తాగునీటి కష్టాలు





మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, కన్నపకుంటలో వాటర్ ట్యాంకుకు పూజలు చేస్తున్న మహిళలు



గోరుమానుకొండలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద పూజలు

డోన్ రూరల్: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు తీరాయని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం గోరుగల్లు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నీటి ట్యాంక్‌ల వద్ద సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పూజా కార్యక్రమాలు చేశారు. సాంపురం గ్రామంలో సర్పంచ్ రాధమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. మారుమూల గ్రామాలకు సైతం నీటిని అందించిన ఘనత బుగ్గనదేనని కొనియాడారు. అభివృద్ధి పనులతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్ను భారీ మెజారిటీతో తెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, తిమ్మాపురం సర్పంచ్ సుంకులమ్మ, ఆవులదొడ్డి సర్పంచ్ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు

బేతంచెర్ల: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గ్రామాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందించడానికి రూ. 351 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని గోరుమానుకొండ, రహిమానుపురం, ఎం.పేండేకల్లు గ్రామాల్లో సర్పంచ్‌లు కోడె వెంకటేశ్వర్లు, ప్రమీలమ్మ, ముచ్చు రామక్క ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద పూజలు చేశారు.

చాలా సంతోషంగా ఉంది



గతంలో నీటి కోసం అనేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు గ్రామంలోకి మంచి నీటిని అందిస్తుండడం చాలా సంతోషంగా ఉంది. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన మేలు ఎప్పటికీ మరచిపోలేం. ఆయనకు ఓటు వేసి గెలిపించుకుంటాం.

-గట్టుసుంకన్న, వెంకటాపురం

రుణపడి ఉంటాం



మండలంలోని ప్రతి గ్రామంలో నీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేసి గోరుగల్లు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడం హర్షణీయం. వేసవిలో నీటి కష్టాలు తొలగాయి. ఏళ్ల నాటి సమస్య మంత్రిచొరవతో పరిష్కారమైంది. బుగ్గనకు రుణపడి ఉంటాం.

-ఓబులేష్, లక్ష్మంపల్లి గ్రామం

మహిళపై గొడ్డలితో దాడి

కోవెలకుంట్ల: స్థలం విషయంలో వివాదం చోటుచేసుకోవడంతో మహిళపై గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటన సోమవారం మండలంలోని బిజనవేముల గ్రామంలో జరిగింది. ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. గ్రామంలోని కొత్త బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న బాలమ్మ తన ఇంటిపక్కన దస్తగిరి అనే వ్యక్తి స్థలంలో పశువుల పాక ఏర్పాటు చేసుకుంది. ఈ విషయంపై దస్తగిరి కుమార్తెతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువురి మధ్య గొడవ జరిగిన విషయాన్ని తండ్రితో చెప్పింది. ఆవేశానికి లోనైనా దస్తగిరి ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమెపై దాడి చేశాడు. దాడిలో బాలమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే రామిరెడ్డి



ఆలయం వెలుపల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈయనతో పాటు అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు.

శివదీక్షలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



యాగంటి క్షేత్రంలో శివదీక్ష స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం శివదీక్ష మాలధారణ స్వీకరించారు. సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. శివపార్వతులకు అభిషేక పూజలు చేశారు. 33వ ఏట శివదీక్ష మాలధారణ స్వీకరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఏఈకి అభినందనల వెల్లువ



ఏఈకి అభినందనలు తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

డోన్ టౌన్: ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవం రోజున తిరుపతిలో విద్యుత్‌శాఖ సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఏఈ నాగేశ్వరరెడ్డికి ఉద్యోగులు అభినందనలు తెలిపారు. సోమవారం డోన్‌లోని ఆ శాఖ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. పోర్మన్ వెంకటేశ్వర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీరాములు, డోమ్లానాయక్, లైన్‌మన్లు కృష్ణారెడ్డి, షేక్షావలి, వెంకటరాముడు, జేఎల్ఎంలు ఉచ్చారెడ్డి, గౌస్, మధు, చంద్ర, మల్లి, సూరి తదితరులు పాల్గొన్నారు.

అతివలే.. న్యాయ నిర్ణేతలు

- బనగానపల్లెలో మొత్తం ఓటర్లు 2,38,900
- మహిళలు 1,21,531 , పురుషులు 1,17,344



కొలిమిగుండ్ల: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గంలో అభ్యర్థుల భవితవ్యాన్ని మహిళా ఓటర్లు నిర్ణయించనున్నారు. ఈనెల 22న ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,38,900 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,21,531, పురుషులు 1,17,344 మంది కాగా ఇతరులు 25 మంది ఉన్నారు. త్వరలో రాష్ట్రంలో జరిగే శాసనసభ, పార్లమెంట్ స్థానాలకు సంబంధించి వచ్చే నెల చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. డెత్ కేసులు, ఇతర కారణాలతో గ్రామాల్లో అందుబాటులో లేని వారి పేర్లను పూర్తి స్థాయిలో విచారించి తొలగించారు. 18 ఏళ్ల నిండిన వారు ఫారం-6 ద్వారా ఓటు హక్కు కోసం నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. రానున్న ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపునకు కీలకం కానున్నారు. ఐదు మండలాల్లో మహిళా ఓటర్లే పురుషుల కంటే 4,187 మంది అధికంగా ఉన్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కొలిమిగుండ్ల	20,937	21,376	04	42,317
అవుకు	21,239	21,465	05	42,709
సంజామల	15,821	16,083	05	31,909
కోవెలకుంట్ల	18,875	20,266	04	39,145
బనగానపల్లె	40,472	42,341	07	82,820